ప్రజాశక్తి
బుధవారం 29 జనవరి 2025
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

సొంత గనులు అక్కర్లేదా ?

ఉక్కుపై లోకేష్ వ్యాఖ్యల పట్ల కార్మికుల్లో ఆవేదన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'సొంత గనుల్లేకపోయినా గతంలో లాభాలు వచ్చాయి కదా ! దేశంలో ఎవరికి సొంత గనులున్నాయి' అంటూ రాష్ట్ర మంత్రి నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలపై నేడు విశాఖలో చర్చ సాగుతోంది. కేప్టివ్ మైన్స్ అర్థంలేని వాదన అంటూ ఆయన మీడియా సాక్షిగా ఆడిన మాటలు విస్మయం గొలుపుతున్నాయి. ఉక్కు కార్మికులు ఆ వ్యాఖ్యలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించే బాధ్యత నుంచి తప్పించుకునేలా చినబాబు మాటలున్నాయి. విశాఖలో పరువు నష్టం కేసు విచారణ సందర్భంగా ఈ నెల 27న కోర్టుకు లోకేష్ హాజరయ్యారు. ఉక్కు పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని చెబుతూనే సొంత గనులపై అర్థంలేని వాదనను ముందుకు తెచ్చారు. నాలుగేళ్లుగా ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఇక్కడి కార్మికవర్గం, ప్రజానీకం ఉద్యమిస్తోంది. ప్లాంట్‌కు సొంత గనులు కావాలని, సెయిల్‌లో విలీనం చేయాలని పోరాడుతున్న కార్మికవర్గాన్ని దెబ్బకొట్టేలా 'చినబాబు' వ్యాఖ్యలున్నాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ఈ నేపథ్యంలో విశాఖ ఉక్కు హక్కు పట్ల కూటమి పాలకులకు ఉండే శ్రద్ధ ఇదేనా? బాధ్యత ఇంతేనా? అన్న చర్చ సర్వత్రా నడుస్తోంది. ఉక్కుపై కూటమి నేతలందరికీ ఇదే నిర్లక్ష్యపు వరుస. కొద్దిరోజుల క్రితం బిజెపి ఎంఎల్ఎ విష్ణుకుమార్ రాజు వ్యాఖ్యల సంగతి తెలిసిందే. కేంద్రం రూ.వేల కోట్లు కేటాయించినా ప్లాంట్ వ్యవహారంలో కార్మిక సంఘాలు రెచ్చగొడుతున్నాయంటూ మాట్లాడిన ఆ కాషాయ ఎమ్మెల్యే తీరును ప్రజాస్వామిక వాదులంతా ఖండించారు. ఆ పార్టీ మాజీ ఎంఎల్‌సి మాధవ్ సహా అందిరిదీ ఇదే తోవ.

మాట్లాడుతున్న నారా లోకేష్ (ఫైల్ ఫొటో)

సొంత గనులు ఎవ్వరికీ లేవా ?

దేశంలో సెయిల్‌కి, జిందాల్‌కి, మిట్టల్‌కి, టాటాప్లాంట్ అన్నింటికీ సొంత గనులున్నాయి. పై ఇన్ని ప్లాంట్‌లకు సొంతంగా గనులుంటే ప్రతిష్టాత్మకమైన విశాఖ స్టీల్‌కు గనులుండాల్సిన అవసరం లేదా ? – అని పలువురు నేడు ప్రశ్నిస్తున్నారు. టిడిపిలో చంద్రబాబు తర్వాత స్థానంలో ఉండే మంత్రి లోకేష్‌కు ఎందుకీ హ్రస్వ దృష్టి అంటూ పలువురు మండిపడుతున్నారు. పైపెచ్చు కేంద్రం స్టీరింగ్‌ను నడిపే పార్టీల్లో తెలుగుదేశం ఉంది. ఎపి నుంచి బలమైన ఎంపీలతో ఉన్నా, తమది 'డబుల్ ఇంజిన్' సర్కారు అంటూ గొప్పలు చెప్పడం తప్ప ఆచరణలో ఏం సాధించారన్నది వారే చెప్పాలి. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటైన నుంచీ నేటి వరకూ సొంత గనుల సమస్య వెంటాడుతూనే ఉంది. సొంత గనుల్లేనందున ఒక టన్ను కొనుగోలుపై రూ.వేల కోట్ల భారం మిగతా 2లో..

ఉక్కు రక్షణ జాతా బృందానికి కాగడాను అందజేస్తున్న సిహెచ్.నర్సింగరావు, లోకనాథం, జగ్గునాయుడు తదితరులు

శ్రామిక వర్గ రాజ్యంతోనే
ప్రజా సమస్యల విముక్తి

- సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు
- విశాఖ నుంచి ఉక్కు రక్షణ జాతా ప్రారంభం

శ్రామిక వర్గ రాజ్యం వచ్చినప్పుడే దేశంలోని ప్రజలందరి సమస్యలకూ విముక్తి దొరుకుతుందని సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు అన్నారు. పార్టీ 27వ మహాసభ ఫిబ్రవరి 1 నుంచి 3 వరకూ నెల్లూరులో జరుగనున్న నేపథ్యంలో సిపిఎం ఆధ్వర్యాన వైజాగ్ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం తలపెట్టిన రాష్ట్ర జాతాను కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు దీక్షా శిబిరం నుంచి ఆయన మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, పెద్ద సంఖ్యలో కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

వార్త మెయిన్‌లో..

అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి

▶ వార్త 5లో..

రూ.50 వేల కోట్లు ప్యాకేజీ ప్రకటించాలి

▶ వార్త 5లో..

ములాఖత్‌కు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు

▶ వార్త 3లో..

మాట్లాడుతున్న హీరో నాగ చైతన్య

విశాఖలో 'తండేల్' సందడి

సినిమా విజయం ఖాయం : హీరో నాగచైతన్య

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నాగచైతన్య కథానాయకుడిగా నటించిన పాన్ ఇండియా సినిమా 'తండేల్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు విశాఖ వేదికైంది. మంగళవారం రామాటాకీస్‌లో తలపెట్టిన ఈ కార్యక్రమానికి చిత్ర బృందమంతా తరలివచ్చింది. దీంతో సందడి వాతావరణం నెలకొంది. విశాఖపట్నం అంటే తనకు ఎంతో ఇష్టమని అక్కినేని నాగచైతన్య అన్నారు. విశాఖతో తన అనుబంధం, మిగతా 2లో..

ఘనంగా మేజర్ పోర్ట్స్ క్యారమ్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రతిష్టాత్మకమైన ఆల్ ఇండియా మేజర్ పోర్ట్స్ క్యారమ్ ఛాంపియన్‌షిప్ 2024-25 విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరుగనున్న ఈ ఛాంపియన్ షిప్‌ను పోర్ట్ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దూబే పోర్ట్ ఇండోర్ స్టేడియంలో ప్రారంభించారు. ముంబయి, దీనదయాల్, కొల్‌కతా, చెన్నయ్, పారాదీప్, జవహర్‌లాల్ నెహ్రూ, న్యూ మంగళూరు, కామరాజార్, హోస్ట్ పోర్ట్ విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సహా తొమ్మిది ప్రధాన పోర్టుల నుండి క్రీడాకారులు ఆ ఛాంపియన్ షిప్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుర్గేష్ కుమార్ దూబే మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని అన్నారు. క్యారమ్ ఆట ఆడటానికి అవసరమైన నైపుణ్యం, సాధన మానసిక ఆనందాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. దేశ వ్యాప్తంగా క్యారమ్స్‌కు పెరుగుతున్న ఆదరణను ఆయన వివరించారు. ప్రతి ఒక్క ఆటగాడూ క్రీడాస్ఫూర్తితో పాల్గొని విశాఖపట్నం పోర్టు అందించిన ఆతిథ్యాన్ని ఆస్వాదించాలన్నారు. ఈ సందర్భంగా విశాఖకు చెందిన అంతర్జాతీయ స్థాయి క్యారమ్ ఆటగాడు జనార్ధన్ రెడ్డిని సత్కరించి రాబోయే టోర్నమెంట్లలో విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పోర్ట్ విభాగాధిపతులు, అధికారులు, పోర్టుల ఆటగాళ్లు పాల్గొన్నారు.

క్యారమ్ పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

మొదటి పేజీ తరువాయి..

సొంత గనులు అక్కర్లేదా ?

పడుతున్నందున లాభాల బాట పట్టని స్థితి కొనసాగుతోంది. అలాగని స్టీల్‌ప్లాంట్ సొంత గనుల్లేకపోయినా ఉత్పత్తి సాధనలో ఎన్నడూ వెనుకడుగు వేయలేదు. పై పరిశ్రమలన్నిటికీ సొంత గనులుండి స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గనులు కేటాయించకుండా తీవ్ర జాప్యం చేయడమే కాకుండా అధికారం చేతికి చిక్కినాక 'ప్లేటు ఫిరాయింపు' ధోరణేమిటి ? అంటూ పలువురు మంత్రి లోకేష్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐదు నెలలుగా జీతాల్లేకుండా ఆర్థిక అవస్థలతో అల్లాడిపోతున్న కార్మికులు, వారి కుటుంబ సభ్యులను కనీసం పలకరించే 'కూటమి' నాయకుడు లేడంటే ఆశ్చర్యం కలుగక మానదు.

విశాఖలో 'తండేల్' సందడి

విశాఖ అమ్మాయి శోభిత ధూళిపాళతో తన ప్రేమ వివాహం, ఇంట్లో ఎవరిది పైచేయి? అనే అంశాలపై ఆయన మాట్లాడుతూ అభిమానుల్లో జోష్ నింపారు. మత్స్యకార నేపథ్యంలో వస్తున్న ఈ సినిమా కచ్చితంగా విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నిర్మాత అల్లు అరవింద్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఫిబ్రవరి 7న తెలుగుతో పాటు తమిళ, హిందీ భాషల్లో తండేల్ సినిమా విడుదల కానుంది. అందులో సాయి పల్లవి హీరోయిన్‌గా నటించారు.

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో మెగా మెడికల్ క్యాంపును మంగళవారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపును విజ్ఞాన కేంద్రం చైర్మన్ వీఎస్.పద్మనాభరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం సేవా దృక్పథంతో మొదలైందని, దానిలో భాగంగానే ప్రతి నెలా మెడికల్ క్యాంప్ జరుగుతోందని తెలిపారు. సీనియర్ వైద్యులు డాక్టర్ సి.శ్రీనివాసరావు ప్రతిరోజూ సాయంత్రం 5:30 గంటల నుంచి ఉచితంగా వైద్యం చేస్తున్నారని, ఆ సేవలను సద్వినియోగ పరచుకోవాలని విజ్ఞప్తి చేశారు. మెడికవర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ సాయి, డాక్టర్ జోష్న మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే వైద్యం చేయటం సాధ్యమవుతుందని, రోగి పూర్తి రిలీఫ్‌ను పొందవచ్చని తెలిపారు. క్యాన్సర్ ఉందా ? లేదా ? తెలుసుకొనే నిర్ధారణ పరీక్షలు బాగా ఖర్చుతో కూడుకున్నవని తెలిపారు. మెడికవర్ హాస్పిటల్స్ ఉచితంగా క్యాంపులు నిర్వహించి సేవలు ఉచితంగా అందిస్తున్నాయని చెప్పారు. ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల సర్వేలో ప్రజల జేబుల నుంచి ప్రతి రూ.100కు రూ.67ను వైద్యం కోసం ఖర్చు చేయవలసిన పరిస్థితి ఏర్పడిందని తేలిందన్నారు. విశాఖ జిల్లా హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.రాజు మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యాన్ని ప్రభుత్వాలు బాధ్యతగా తీసుకొని ప్రజలకు ఉచితంగా ఆరోగ్యం అందించాల్సిందిపోయి ఆరోగ్య పరికరాలపైనా, మందులపైనా ట్యాక్స్ వేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో ప్రజా ఆరోగ్య పరిరక్షణ కమిటీ రాష్ట్ర కమిటీ సభ్యులు కెవిపి.చంద్రమౌళి, ప్రజా ఆరోగ్య వేదిక జిల్లా కార్యదర్శి శేషు కుమార్, ఐ టెక్నీషియన్ రాజు, మెడికవర్ హాస్పిటల్ ఇంచార్జ్ కిరణ్, పలువురు టెక్నీషియన్లు పాల్గొన్నారు. ఈ సేవలను 150 మందికిపైగా రోగులు వినియోగించుకున్నారు. తదుపరి క్యాంపు ఫిబ్రవరి 25న ఉంటుందని నిర్వాహకులు చెప్పారు.

పోరాటాలతో స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కార్మిక, ప్రజా ఐక్య పోరాటాలతో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని సిఐటియు జగదాంబ జోన్ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మిక, ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు మంగళవారం నాటికి 1402వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ నాయకులు కూర్చున్నారు.

వారినుద్దేశించి కె.సంతోష్ మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కార్మిక, కర్షక, ప్రజా సంఘాలు చేస్తున్న పోరాటాన్ని తెలియజేశారు. పోరాట ధాటిని తట్టుకోలేక దొడ్డిదారిన తమ ప్రైవేటీకరణ అజెండాను అమలు చేసే ప్రయత్నం మోడీ ప్రభుత్వం చేస్తోందని అన్నారు. ఈ నేపథ్యంలో పోరాట ఉధృతిని పెంచి కర్మాగారాన్ని రక్షించుకుంటామని చెప్పారు. కార్యక్రమం సీనియర్ నాయకులు వై.రాజు, ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు, సంజయ్, కెవిపి.చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన విఒఎల దీక్షలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విఒఎలకు బకాయి ఉన్న ఆరు నెలల జీతాలను చెల్లించాలని, మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని కోరుతూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఎపి వెలుగు విఒఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన చేపట్టిన సామూహిక దీక్షలు రెండో రోజైన మంగళవారమూ కొనసాగాయి. వారినుద్దేశించి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.రూపాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విఒఎల సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర అలసత్వం వహిస్తోందన్నారు. ప్రతినెలా జీతం ఇవ్వాల్సిన కనీస బాధ్యతను ప్రభుత్వం నిర్వహించకపోవడం దుర్మార్గమన్నారు. ఆరు నెలలుగా జీతం ఇవ్వకుండా పని చేయించుకోవడం వెట్టి చాకిరీ అవుతుందన్నారు. ఉద్యోగ భద్రత కల్పిస్తామని, మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని కోరారు. డిసెంబర్ 16న సెర్ప్ సిఇఒ సమక్షంలో జరిగిన చర్చలు, నిర్ణయాలు ఇంత వరకూ అమలు కాకపోవడం అత్యంత శోచనీయమన్నారు. అక్రమంగా తొలగించిన విఒఎలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకపోవడం కోర్టుధిక్కారమన్నారు. విపరీతమైన పనిభారం పెంచారన్నారు. మహిళా మార్ట్‌లలో బలవంతపు కొనుగోళ్ళు వల్ల ప్రజలు, గ్రూపు సభ్యుల నుండి తీవ్ర వ్యతిరేకత వస్తోందన్నారు. దీక్షల్లో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.మణి, తదితరులు పాల్గొన్నారు. నిరాహార దీక్షలో ఆనందపురం, పెందుర్తి, పద్మనాభం, భీమిలి మండలాల నుండి యానిమేటర్లు, యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అపర్ణ, కంచమ్మ, కోశాధికారి శ్రీలక్ష్మి, నాయకులు వెంకటలక్ష్మి, పార్వతి, శారద తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో నినాదాలు చేస్తున్న విఒఎలు

అధికారుల హామీతో దీక్షల విరమణ

అనకాపల్లి : సమస్యలపై స్థానిక కలెక్టరేట్ వద్ద చేపట్టిన సామూహిక నిరాహార దీక్షలను అధికారుల హామీతో విఒఎలు మంగళవారం విరమించారు. రెండో రోజు దీక్షలను సంఘం జిల్లా అధ్యక్షులు కె.సూరిబాబు ప్రారంభించారు. రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.రూపాదేవి, జిల్లా గౌరవాధ్యక్షులు వివి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విఒఎల సమస్యలను తెలియజేశారు. ఈ నేపథ్యంలో రెండో రోజు అధికారులు దిగివచ్చి చర్చలు జరిపారు. రెండు నెలల జీతాలను వేసేందుకు, మరో వారంలో మూడు నెలల జీతాలు ఇవ్వడానికి సెర్ప్ సిఇఒ, జిల్లా ప్రాజెక్టు అధికారి హామీ ఇచ్చినట్టు సంఘం నాయకులు తెలిపారు.

మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు, ఇతర సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 4వ తేదీన సెర్ప్ సిఇఒతో చర్చలు జరిపేందుకు హామీ లభించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి కె.లక్ష్మీప్రసన్న, పుష్ప, అప్పలనాయుడు, భవాని, వై.లక్ష్మి, నూకరత్నం, పెద్ద సంఖ్యలో విఒఎలు పాల్గొన్నారు.

రామన్నకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - అరకులోయ రూరల్ : ఇటీవల ప్రమాదానికి గురై చేతిని కోల్పోయిన ప్రజాశక్తి అనంతగిరి విలేకరి జె.రామన్నకు సంస్థ ఆర్థిక సాయమందించింది. ఈ మేరకు ప్రజాశక్తి సాహితీ సంస్థ తరుపున రూ.10 వేలను జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరావు అందజేశారు. తొలుత అనంతగిరి మండలంలోని రామన్న స్వగ్రామమైన రాజుపాకకు వెళ్లి రామన్నను, కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమంలో సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, పంచాయతీ మాజీ సర్పంచి దీసరి లచ్చు, ప్రజాశక్తి డెస్క్ ఇన్‌ఛార్జి కె.అప్పలనాయుడు, ఎడివిటి ఇన్‌చార్జి రాజేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సాయం అందజేస్తున్న వెంకటేశ్వరరావు, చిత్రంలో గంగరాజు తదితరులు

సూత్ర ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇండియన్ ఫ్యాషన్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ సూత్ర మంగళవారం ఉదయం బీచ్ రోడ్‌లోని నోవాటెల్ హోటల్‌లో ప్రారంభమైంది. వివాహ కాలానికి ప్రత్యేక వస్త్రాలతో కూడిన అద్భుతమైన వెడ్డింగ్ స్పెషల్ ఇదని నిర్వాహకులు తెలిపారు. నోవాటెల్ వేదికగా రెండు రోజులు పాటు దీన్ని నిర్వహిస్తున్నామని ఉమేష్ తెలిపారు. ఎగ్జిబిషన్ ప్రారంభం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అనూహ్యమైన అపరిమిత వివాహ షాపింగ్ అనుభవం కోసం సూత్రా ఎగ్జిబిషన్‌ను సందర్శించవలసిందిగా కోరారు. దేశం నలుమూలల నుండి 100పైగా డిజైనర్లు అద్భుతమైన, వినూత్నమైన వస్త్రాలను ప్రదర్శించనున్నారని తెలిపారు. ప్రధానంగా బ్రైడల్ కోచర్, ట్రెండింగ్ లెహంగాలు, బెస్పోక్ జ్యువెలరీ, డిజైనర్ క్లచ్‌లు ఉన్నాయన్నారు.

విజయ సాయిరెడ్డి అక్రమాలపై విచారణ జరపాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాజకీయాలను వదిలేసినంత మాత్రాన మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి చేసిన అక్రమాలు మాయం అవ్వవని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి అన్నారు. గత జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలను అడ్డం పెట్టుకొని విజయసాయి రెడ్డి చేసిన అడ్డుగోలు వ్యవహారాలు అన్నింటిపై హైకోర్టు సిటింగ్ జడ్జితో విచారణ జరపాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం అల్లిపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారాన్ని అడ్డం పెట్టుకొని విజయసాయి రెడ్డి చేసిన అక్రమాలు, ఆగడాల కారణంగా విశాఖ నగరం బ్రాండ్ ఇమేజ్ మసక బారిందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఎ.విమల, రెహమాన్, క్షేత్ర పాల్ తదితరులు పాల్గొన్నారు.

30, 31 తేదీలలో సిపిఐ జాతీయ కార్యవర్గ సమావేశాలు

సిపిఐ జాతీయ కార్యవర్గ సమావేశాలు ఈ నెల 30, 31 తేదీలలో విశాఖపట్నం నగరంలో జరుగుతాయని సత్యనారాయణ మూర్తి తెలిపారు. దేశం నలుమూల నుంచి పార్టీ కీలక నేతలు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలన, వివిధ రంగాల పరిస్థితిపై చర్చించి భవిష్యత్ కార్యక్రమాల రూపకల్పన చేయనున్నట్టు వివరించారు. సిపిఐ శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో బుధవారం సాయంత్రం 5 గంటలకు నగరంలోని పౌర గ్రంథాలయంలో 'ఆధునిక భారత నిర్మాణంలో సిపిఐ పాత్ర - భవిష్యత్తు సవాళ్లు' అనే అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సదస్సులో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రసంగిస్తారన్నారు.

'IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT VIZIANAGARAM
O.S.No. 61/2023

Between:
Mr.Gedela Kamalakara Rao ... Plaintiff
And:
Smt. Inturi Lakshmi Renuka Devi ... Defendant
SUMMONS TO THE DEFENDANT
To,
Smt. Inturi Lakshmi Renuka Devi,
W/o. Inturi Satyanarayana,
residing at D.No.47-10-36,
Diamond Park, Dwarakanagar,
Visakhapatnam 530 016.

Please take notice that the Hon'ble Court was pleased to order notice to you the in the above suit through this publication as the above plaintiff filed the above suit. There fore you are hereby called upon to appear before this Hon'ble Court on **Dt. 25-02-2025 at 10.30 A.M.,** Personally or through an Advocate. If you fails to apeear before this Hon'ble Court on that day the matter will be heard in your necessary orders will be passed against you.

(By Order of the Hon'ble Court)
N.S.V.REDDY
Advocate
Venumadhavi Villa,
N.G.G.O's Colony
Akkayyapalem,
Visakhapatnam-530016
Ph. 93 93 10 20 36
Visakhapatnam
Dt. 28-01-2025

మహారాజశ్రీ విశాఖపట్నం 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.P.No. 46 / 2023

మధ్య: చిలకా వెంకట దాశరథి ప్రవీణ్ ... పిటీషనరు
మరియు: వడ్డిబోయిన వరుణ్‌కుమార్ మరియు ఇతరులు ... రెస్పాండెంట్స్

నోటీసు

రెస్పాండెంట్ నెం.4
తుమ్మల సత్యసాయికుమార్,
తండ్రి తుమ్మల వీరబాబు,
అరట్లకోట గ్రామము, పాయకరావుపేట మండలము, విశాఖపట్నం.

పై నెంబరు గల ఇన్‌సాల్వెన్సీ (దివాలా) పిటీషన్‌లో చిలకా దాశరథి ప్రవీణ్ మీపై **I.P. No. 46/2023** పిటీషన్ వేసియున్నారు. కాగా పై నెంబరు గల ఇన్‌సాల్వెన్సీ పిటీషన్‌లో శ్రీకోర్టు వారు మీ హాజరు కొరకు **తేది: 13-2-2025కి** వాయిదా వేసియున్నారు. కావున పై దినమున మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని **ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలను తెలుపవలెను. లేనియెడల పై ఇన్‌సాల్వెన్సీ పిటీషన్ మీ పరోక్షమున తీర్మాణించబడునని తెలియ జేయడమైనది.

(By Order of the Hon'ble Court)
B.YASODHARA VEDAMANI
K.V.RAMANA, Advcoates,
Gajuwaka, Visakhapatnam.
Cell : 92466 21519, 92488 09471

కేన్సర్ వ్యాధిలో మైటోకాండ్రియా పాత్రపై పరిశోధనలు

యూనివర్సిటీ ఆఫ్ కాన్సాస్ కేన్సర్ సెంటర్ పరిశోధకులను సన్మానిస్తున్నగీతం ప్రతినిధులు

ప్రజాశక్తి -మధురవాడ : చిన్న పరిమాణం కలిగినప్పటికి, శరీరంలో ఉండే మైటోకాండ్రియాను కణానికి శక్తిని అందించే 'పవర్ హౌస్'గా విశ్వసిస్తారని అయితే కేన్సర్ వ్యాపించే అవకాశాన్ని నిర్ణయించడంలో మైటోకాండ్రియా కీలక సమాచారం కలిగి ఉంటుందని తమ పరిశోధనలో వెల్లడైందని యూనివర్సిటీ ఆఫ్ కాన్సాస్ కేన్సర్ సెంటర్ (యుఎస్ఎ) పరిశోధకుడు ప్రొఫెసర్ డేనీ ఆర్.వెల్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ జీవ శాస్త్ర విభాగం నిర్వహించిన కార్యక్రమంలో మంగళవారం ఆయన ప్రసంగించారు. కేన్సర్ సంబంధమైన మరణాలలో మెటాస్టాసిస్ అంటే కేన్సర్ వ్యాప్తి 90 శాతం పైగా కారణమవుతోందని, అయినప్పటికి దీని పూర్తి స్థాయిలో అర్థం చేసుకోవడానికి ఇప్పటి వరకు ప్రపంచదేశాలలో సరైన ప్రయత్నం జరగలేదని అభిప్రాయపడ్డారు. ప్రొఫెసర్ వెల్ మాట్లాడుతూ, కేన్సర్ సంబంధిత మరణాలలో మెటాస్టాసిస్ ప్రధాన కారణమని వివరించారు. కేన్సర్ వ్యాప్తి ప్రక్రియ కణాల అంతర్గత లక్షణాలు, కేన్సర్ కణాలు, వివిధ సూక్ష్మపర్యావరణాల మధ్య జరిగే సంక్లిష్టమైన పరస్పర ప్రభావాలతో ముడిపడి ఉందని వివరించారు. కేన్సర్ మెటాస్టాసిస్‌లో మైటోకాండ్రియల్ జన్యుపరమైన పాత్రను వివరించి, ఈరంగంలో ఇటీవల జరిగిన పరిశోధనలను ఆయన పస్తావించారు. మైటోకాండ్రియల్ డిఎన్ఎ కేన్సర్‌లో ఏ విధమైన పాత్ర పోషిస్తుందో మంచి అవగాహన కలిగితే, రాబోయే రోజుల్లో వ్యక్తిగత, వైద్య చికిత్సలకు మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఈ అధ్యయనాలు కేన్సర్ చికిత్సా విధానాలను మెరుగుపరిచే మార్గాన్ని సూచిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.వేదవతి, స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ అధిపతి ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాస్, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు హజరై కేన్సర్ పరిశోధన, భవిష్యత్తు, వైద్య రంగంలో వచ్చే కొత్త చికిత్స అవకాశాలు గురించి చర్చించారు.

ములాఖత్‌కు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారంలో ఖైదీలను కలిసేందుకు ఇచ్చే ములాఖత్ ఇక నుంచి ఆన్‌లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారి మహేష్ బాబు తెలిపారు. ఇంతక ముందు కారాగారంలో ములాఖత్ ద్వారా ఖైదీలను కలవాంటే కేంద్రకారాగారానికి వచ్చి ప్రవేశద్వారం వద్ద ఉన్న కార్యాలయంలో తగిన ఆధారాలతో రిజిస్టర్ చేసుకొని అనంతరం ఖైదీలను కలిసేవారని, ఇప్పుడు ముందుగానే తమ ఇంటి నుంచే ఈప్రిజన్ ఎన్ఐసి.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని కోరిన రోజు కారాగారానికి రావచ్చని పేర్కొన్నారు. దీంతో పాటు ఈ- ములాఖత్ విధానంలో వీడియోకాల్ ద్వారా ఖైదీలు వారానికి రెండుసార్లు మాట్లాడే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. దీనికోసం అదనంగా కంప్యూటర్లు సమకూర్చామన్నారు. ఈ విధానం ద్వారా ఖైదీలు తమ కుటుంబసభ్యులతో మాట్లాడుకోవచ్చని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి -మధురవాడ : మారికవలస సబ్‌స్టేషన్ పరిధి 11కెవి ఇండస్ట్రియల్ ఫీడర్, 11కెవి జేక్ లే-అవుట్ ఫీడర్లపై బుధవారం మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు జోన్ -3 డిఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. మారికవలస జంక్షన్, మారికవలస గ్రామం, బోరవానిపాలెం, మారికవలస జెఎన్ఎన్‌యుఆర్ఎం.కాలనీ, బోరవానిపాలెం డ్రైవర్స్ కాలనీ, జేక్ లేఅవుట్, కొత్త పరదేశిపాలెం, పాత పరదేశిపాలెం తదితర ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉడదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ప్రతి అక్షరం-ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
అనుభవం కలిగిన
సబ్ ఎడిటర్
కావలెను
ప్రజాశక్తి కార్యాలయం
ప్లాట్ నెం.3, జి.బ్లాక్, ఆటోనగర్, ఇండస్ట్రియల్ పార్క్, వడ్లపూడి, ఎం.వి.వి.అపార్ట్‌మెంట్ ప్రక్కన
విశాఖపట్నం-530046
ఫోన్ : 9491570765

అవంతిలో 'ప్రగ్యాన్' పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఫిబ్రవరి 2వ తేదీన జరగనున్న 'ప్రగ్యాన్ 2కె 25' పాలిటెక్నిక్ ఫెస్ట్ సాంకేతిక సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంగళవారం కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సదస్సులో విద్యార్థులు తయారుచేసిన పలు నమూనాలు ప్రదర్శించనున్నట్లు ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలపై దృష్టి పెట్టి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తాటితూరులో పొలం పిలుస్తోంది

మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న విజయప్రసాద్, శివకోమలి

ప్రజాశక్తి -తగరపువలస : మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన మంగళవారం భీమిలి మండలం తాటితూరు మొక్కజొన్న పంట పొలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ భీమిలి డివిజన్ సహాయ సంచాలకులు బి.విజయప్రసాద్, ఎఒ బి.శివకోమలి మాట్లాడుతూ, ప్రస్తుత సీజన్‌లో సాగులో ఉన్న మొక్క జొన్న, రాగి, నువ్వులు, వరి పంటకు సంబంధించి రైతులకు పలు సూచనలు చేశారు. మొక్క జొన్నలో కత్తెర పురుగు ఆశించినట్లు గుర్తించామని, పురుగు ప్రాథమిక దశలో ఉంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా జాతీయ ఆహార భద్రతా పథకంలో భాగంగా వైఎల్ఎం 66 రకం నువ్వుల విత్తనాలను 50 శాతం రాయితీపై రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది వాసంతి, రమేష్, హరీష్, కృపామణి పాల్గొన్నారు.

మినీ గోకులం బకాయిలపై వినతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇప్పటికే నిర్మించుకున్న మినీ గోకులం షెడ్ల నిర్మాణానికి సంబంధించి బిల్లు బకాయిలను సత్వరమే మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ టిడిపి జిల్లా కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బార్‌లో రాష్ట్ర ఐటి శాఖా మంత్రి నారా లోకేష్‌కు జిల్లా పశు గణాభివృద్ధి సంఘం చైర్మన్, జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పడు వినతి పత్రం అందజేశారు. షెడ్లు మంజూరు చేయాలంటూ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని కోరారు. మండలంలోని లక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్‌ను ప్రభుత్వ జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని, పలు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు భవనాలు మంజూరు చేయాలని, పలు అభివృద్ధి పనులకు అదనంగా నిధులు మంజూరు చేయాలని వినతి పత్రంలో కోరారు. ఇందుకు మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందించారని వెంకటప్పడు తెలిపారు. మంత్రి లోకేష్‌ను కలిసిన వారిలో మాజీ సర్పంచ్ మజ్జి వెంకటరావు, టిడిపి నాయకులు గాడు తాతినాయుడు, మాకాల అప్పారావు తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బంగార్రాజు

ప్రజాశక్తి-ఆనందపురం : ప్రజా సమస్యల పరిష్కార వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బొద్దపు బంగార్రాజు నియమితులయ్యారు. ఆదివారం తిరుపతి యూత్ హాస్టల్లో నిర్వహించిన ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర కమిటీ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బొద్దపు బంగార్రాజును జాతీయ అధ్యక్షులు మదిరే రంగసాయిరెడ్డి ప్రకటించారు. ఆనందపురం మండలం శొంఠ్యం గ్రామానికి చెందిన బంగార్రాజు అదే గ్రామంలో ఎలిమెంటరీ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదేళ్ల పేరెంట్స్ కమిటీ చైర్మన్‌గా సేవలందించారు. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ, తనకు అప్పగించిన బాధ్యతకు న్యాయం చేస్తానన్నారు. తన సేవలను గుర్తించి బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షులు, కమిటీ మెంబర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి- మాడుగుల : గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో పోతనపూడి అగ్రహారం గ్రామానికి చెందిన తర్ర శ్రీను మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంటన్నర ఘాట్ రోడ్డు జంక్షన్ నుంచి తన స్వగ్రామం పోతనపూడి గ్రామానికి మోటారు బైక్ పై వెళ్తుండగా వీరనారాయణం సమీపంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో శ్రీను రోడ్డు మీద పడడంతో తీవ్రగాయాలపాలై అకస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికుల గుర్తించి శ్రీను కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన మాడుగుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుడు రామ్‌కుమార్ గాయపడిన వ్యక్తికి వైద్య చికిత్స అందించిన అనంతరం తలకి బలమైన గాయం తగలడంతో స్కానింగ్ నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. దీనిపై పోలీసులకు సమాచారం అందించామని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు.

హుండీ చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పెదవాల్తేరు శివాలయంలో ఈ నెల 25 అర్ధరాత్రి జరిగిన హుండీ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. నిందితున్ని పట్టుకుని చోరీకి గురైన నగదును స్వాధీనం చేసుకున్నామని ద్వారక క్రైమ్ ఎసిపి ఎ.వెంకటరావు తెలిపారు. మంగళవారం ఎంవిపి క్రైమ్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. పూజారి విశ్వనాథ కాశీ ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరపగా శివాలయం వెనుక నివాసం ఉంటున్న తూముల హరికృష్ణ నిందితునిగా తేలాడన్నారు. సమావేశంలో క్రైమ్ సిఐ చక్రధర రావు, ఎస్ఐ ఎంఎ.రాజు పాల్గొన్నారు.

మరమ్మతులకు అవకాశం ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 14వ వార్డు పరిధి రామకృష్ణనగర్‌లో పేదలు నివసిస్తున్న పాకలు, రేకుల షెడ్లు మరమ్మతులకు దేవస్థానం అనుమతి ఇవ్వాలని సిపిఎం జిల్లా నాయకులు రాజు, అక్కయ్యపాలెం ఏరియా నాయకులు అప్పలరాజు, శాంతమ్మ కాలనీ ప్రజలు కోరారు. ఈ మేరకు డాక్యుమెంట్లతో కూడిన వివరాలను దేవస్థానం సూపరింటెండెంట్ పి.శ్రీనివాస్‌కు అందజేశారు. దీనిపై సూపరింటెండెంట్ స్పందిస్తూ పైఅధికారులకు ఈ వినతులను పంపిస్తానని హామీ ఇచ్చారు.

చంద్రబాబుతో విష్ణుకుమార్‌రాజు భేటీ

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో చంద్రబాబును ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖపట్నంలోని పలు సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు.

వెంకటరాజును అభినందిస్తున్న వైద్యాధికారి ఫణికుమార్, వైద్యులు

వెంకటరాజుకు అభినందనలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ ద్వారా ప్రశంసాపత్రం అందుకున్న ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం ఐసిటిసి కౌన్సెలర్ రావి వెంకటరాజును మంగళవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి ఎం.ఫణికుమార్, ఎ.కల్యాణ్ శ్రీనివాస్, డి.యుగేష్‌కుమార్ పాల్గొన్నారు.

అవార్డులు బాధ్యత పెంచుతాయి

ప్రజాశక్తి -పద్మనాభం: అవార్డులు బాధ్యతను పెంచుతాయని బిజెపి ఆంధ్రప్రదేశ్ వైద్య విభాగ కన్వీనర్ రూపాకుల రవికుమార్ అన్నారు. గణతంత్ర దినోత్సవంలో పద్మనాభం మండల తహశీల్దార్ కాకర ఆనందరావుకు అవార్డు వచ్చిన సందర్భంగా పద్మనాభం మండల బిజెపి అధ్యక్షులు తమటపు నాగమణి ఆధ్వర్యాన తహశీల్దార్‌ను సత్కరించారు. రూపాకుల రవికుమార్ మాట్లాడుతూ, అంకితభావంతో పనిచేస్తే అవార్డులు లభిస్తాయన్నారు.

బహుమతుల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న సిఐ కామేశ్వరరావు

క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి- గాజువాక : ఆదాని రూరల్ స్పోర్ట్స్ ప్రమోషన్‌లో భాగంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో గంగవరం, దిబ్బపాలెం, శ్రీనగర్‌కు చెందిన 151 టీమ్‌లు పాల్గొన్నాయి. క్రీడాకారులు ప్రతిభను కనబర్చారు. బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పోర్టు ప్రతినిధులు మాట్లాడుతూ, విద్య, ఆరోగ్యం, సుస్థిర జీవనోపాధి కోసం అదాని గంగవరం పోర్టు కృషి చేస్తోందని తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పన, సమాజాభివృద్ధికి అదానీ గంగవరం పోర్టు, ఫౌండేషన్ కట్టుబడి ఉన్నాయని పేర్కొన్నారు. న్యూ పోర్ట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కామేశ్వరరావు మాట్లాడుతూ, క్రీడా పోటీలు నిర్వహించిన పోర్టు యాజమాన్యాన్ని అభినందించారు.

ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న సభ్యులు

ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అవగాహన

ప్రజాశక్తి -గాజువాక : విశ్వ మానవ సంక్షేమ సంఘం, విసిసి ఆధ్వర్యాన పాత గాజువాక జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విశ్వ మానవ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు మస్తానరావు పెసల మాట్లాడుతూ, రెడ్ సిగ్నల్ ఉన్నప్పటికీ వాహనదారులు రోడ్డు దాటటం, మద్యం తాగి వాహనాలు నడపటం, హెల్మెట్ , సీట్ బెల్ట్ ధరించ కుండా నడపటం, ద్విచక్ర వాహనాల మీద ముగ్గురు, నలుగురు ప్రయాణించడం, వ్యతిరేక దిశల్లో, అతి వేగంగా నడపటం వల్ల ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రజలను పోలీసులు ప్రజా సంఘాలు చైతన్యం చేయాలని కోరారు. చదువుకున్నవారు కూడా ట్రాఫిక్ రూల్స్ పాటించటం లేదని తెలిపారు. అందరూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు.

వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ కో-ఆర్డినేటర్ పి.సతీష్ మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నుంచి ప్రజలను రక్షించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా 'మన దేశాన్ని మనమే బాగు పరుచుకోవాలి' అంటూ బ్యానర్లు ప్రదర్శించారు. అతివేగం ప్రమాదకరం, ట్రాఫిక్ రూల్స్ పాటించండి, ప్రమాదాలను నివారించండి అంతూ పలు స్లోగన్స్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విసిసి గాజువాక కన్వీనర్ బి.అప్పారావు, ఆర్గనైజర్ స్వర్ణలత పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఉన్న రోడ్డు అంచు

ప్రమాదాలకు అడ్డుకట్ట వేయరా?

ప్రజాశక్తి-పెందుర్తి : నరవ నుంచి సబ్బవరం వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండేది. గాజువాక నుంచి సబ్బవరం వరకు వెళ్లే వాహనాలతో రద్దీ ఎక్కువగా ఉండేది. గత ప్రభుత్వంలో అనేకసార్లు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అక్కడక్కడ మరమ్మతులు చేపట్టారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కానీ రోడ్డు పక్క అంచులు ఎత్తుగా ఉండటంతో మళ్లీ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు పక్కన ఎడ్జ్‌లను సరిచేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రణాళికతో చదివితే మెరుగైన ఫలితాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం

ఒత్తిడిని జయించి, ప్రణాళిక ప్రకారం చదివితే పదోతరగతిలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అంటున్నారు. మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు రోజు విడిచి రోజు జరుగనున్న ఈ పరీక్షలు ఏడాది శ్రమకు ఫలితం ఇవ్వనున్నాయి.

పదో తరగతి పరీక్షలపై విద్యార్థులకు పలు సూచనలు

నిరంతర పర్యవేక్షణ

ముఖ్యంగా చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. 2024 నవంబర్ 30 నాటికే సిలబస్ పూర్తి చేశాం. 2024 డిసెంబర్ 1 నుంచి పదోతరగతి విద్యార్థులకు 'వంద రోజుల ప్రణాళిక'ను అమలు చేస్తున్నాం. ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు స్టడీ అవర్, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నాం. 67 మంది బాలురు, 38 మంది బాలికలు టెన్త్ పరీక్షలు రాయనున్నారు. ఐదుగురు చొప్పున విద్యార్థులను 21 గ్రూపులుగా ఏర్పాటుచేసి 21 మంది ఉపాధ్యాయులు వారిని దత్తత తీసుకునేలా ఏర్పాట్లు చేశాం.

పొట్నూరు మురళీమోహనరావు
ప్రధానోపాధ్యాయులు,
జెడ్‌పి హైస్కూల్, చిట్టివలస

గణితంలో...

గణితంలో మొత్తంగా 14 చాప్టర్లు ఉంటాయి. 5, 6 చాప్ట ర్లపై ఎక్కువ దృష్టి పెట్టాలి. స్టాటిస్టిక్స్, సంభావిత, వాస్తవ సంఖ్యలు, బహుపదులు, గ్రాఫ్‌కు సంబంధించి లెక్కలుపై దృష్టి పెడితే సులభంగా ఎక్కువ మార్కులు సంపాదించవచ్చు.

కె.శ్రీనివాసరావు
గణిత శాస్త్ర ఉపాధ్యాయులు
జివిఎంసి ఉన్నత పాఠశాల
రాయిపాలెం

ఇంగ్లీష్‌లో...

ఇంగ్లీష్ ప్రశ్నాపత్రం పార్ట్ 'ఎ'లో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. పార్ట్ 'బి' గ్రామర్‌లో 18, 22, 26, 27, 32, 34 ప్రశ్నలకు సమాధానాలు రాస్తే సులభంగా ఎక్కువ మార్కులు సంపాదించవచ్చు. పార్ 'సి'లో 37వ ప్రశ్న చాలా సులభంగా ఉంటుంది. లెటర్ రైటింగ్స్ ద్వారా ఎక్కువ మార్కులు సులభంగా వస్తాయి.

ఇమంది వెంకటరావు
ఇంగ్లీష్ ఉపాధ్యాయులు
ఎంహెచ్.స్కూల్, భీమునిపట్నం

తెలుగులో ఇలా...

తెలుగులో 1వ భాగం 32 మార్కులు, రెండో భాగం 36 మార్కులు, మూడో భాగం 32 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. ఒకటవ భాగంలో తేటగీతి, ఆటవెలది, కంద పద్యాల భావాలు చదవడం, పరిచిత గద్యంలో వాక్య రూప జవాబులు రాస్తే ఎక్కువ మార్కులు సులభంగా సంపాదించ వచ్చు. అపరిచిత గద్యం (లేఖ, వార్త, సంభాషణ, అభినందన పత్రం, కరపత్రం లాంటివి) 3 ప్రశ్నలకు వాక్య రూప సమాధానాలు రాస్తే ఉపయోగంగా ఉంటుంది.

చెరుకూరి శ్రీనివాసరావు
తెలుగు ఉపాధ్యాయులు
జెడ్‌పి హైస్కూల్, లక్ష్మీపురం
భీమునిపట్నం మండలం

గ్రేడ్ల వారీ విభజన..

రోజు వారీ పరీక్షల్లో వచ్చిన మార్కులు ఆధారంగా 81 నుంచి 100 శాతం మార్కులు వచ్చిన వారిని ఎ గ్రేడ్ కింద, 61 నుంచి 80 శాతం మార్కులు వచ్చిన వారిని బి గ్రేడ్ కింద, 41 నుంచి 60 శాతం మార్కులు వచ్చిన వారిని సి గ్రేడ్ కింద, 0 నుంచి 40 శాతం మార్కులు వచ్చిన వారిని డి గ్రేడ్ కింద విభజించి అందుకు అనుగుణంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. మండలంలో 513 మంది బాలురు, 701 మంది బాలికలు ఈ ఏడాది టెన్త్ పరీక్షలు రాయనున్నారు. గతేడాది 79 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది మరింత మెరుగ్గా ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నాం.

ఎం.శివరాణి

భౌతిక, రసాయన శాస్త్రంలో...

ఫిజికల్ సైన్స్‌లో 50, బయోలజికల్ సైన్స్‌లో 50 మార్కులకు ప్రశ్నా పత్రాలు ఉంటాయి. ఎస్‌ఇఆర్‌టి, డిసిఇబి మార్గదర్శకాలకు అనుగుణంగా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నాం. ప్రయోగ శాల కృత్యాలు, డయోగ్రామ్స్, సమాచార పట్టికలు ద్వారా సులభంగా ఎక్కువ మార్కులు సంపాదించ వచ్చు.

పక్కి నాగేశ్వర రావు
భౌతిక, రసాయన శాస్త్ర ఉపాధ్యాయులు,
జెడ్‌పి హైస్కూల్, చిట్టివలస

మెలకువలు పాటించాలి

సాంఘిక శాస్త్రంలో వంద మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. భారత దేశం పటం ద్వారా 4, ప్రపంచ పటం ద్వారా 4 (మ్యాప్ పాయింటింగ్) చొప్పున మొత్తంగా 8 మార్కులు సులభంగా సంపాదించవచ్చు. ఒక మార్కుతో ఉన్న 12 ప్రశ్నలు రాస్తే 12 మార్కులు, 2 మార్కులతో కూడిన 8 ప్రశ్నలకు జవాబులు రాస్తే 16 మార్కులు సంపాదించవచ్చు. 8 మార్కుల ప్రశ్నలు 4, మ్యాప్ పాయింటింగ్ ఒక ప్రశ్న ఉంటాయి. వీటికి 40 మార్కులు ఉంటాయి. 4 ప్రశ్నలకు జవాబులు రాస్తే ఒక్కో ప్రశ్నకు 8 మార్కులు చొప్పున 32 మార్కులు సులభంగా వస్తాయి. పట్టిక ద్వారా 4 ప్రశ్నలకు జవాబులు రాస్తే 8 మార్కులు సులభంగా సంపాదించవచ్చు.

వల్లభదాసు బాలాజీ
సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు
జెడ్‌పి హైస్కూల్
మజ్జిపేట

కలగా మార్కెట్ యార్డు

మురుగు కాలువ మధ్యే కొనసాగుతున్న చేపల అమ్మకాలు

ప్రజాశక్తి -గాజువాక : అక్కిరెడ్డిపాలేనికి చెందిన చేపల వ్యాపారులు బిహెచ్‌పివి వద్ద ఎన్నో ఏళ్లుగా వ్యాపారం చేసేవారు. 2018లో ఖాళీ చేయాలని చేపల వ్యాపారులకు భెల్ యాజమాన్యం నోటీసులు జారీ చేసింది. ఉపాధి చూపిన తర్వాతే ఖాళీ చేయాలని అప్పట్లో సిపిఎం పోరాటం చేసింది. దీంతో రామ్‌నగర్ కాలువ పక్కన తాత్కాలికంగా 15 షెడ్లు నిర్మించారు. తర్వాత మార్కెట్ యార్డును నిర్మించి పర్మినెంట్ షాపులు కల్పిస్తామని జివిఎంసి అధికారులు చెప్పడంతో వ్యాపారులు అంగీకరించారు. కాలువ పక్కనే వ్యాపారులు చేపట్టారు. అయితే ఏళ్లుగడుస్తున్నా మార్కెట్ యార్డు ఊసే లేదు. కాలువ పక్కన వ్యాపారం చేస్తుండటంతో తీవ్ర దుర్వాసన వల్ల ప్రజలు ఎవరూ చేపల కొనుగోలుకు రావడం లేదు. వర్షం వస్తే కాలువ నీరు పొంగి ప్రవహించడంతో చేపలు అమ్మడం కూడా సాధ్యం కాని పరిస్థితి ఉంటోంది. స్థానికంగా ఉన్న ప్రజలు చేపల

మురుగు కాలువ మధ్య ఉన్న చేపల మార్కెట్

కొనుగోలుకు గాజువాక వెళ్తున్నారు తప్ప ఇక్కడికి రావడంలేదు. అక్కిరెడ్డిపాలెంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో మార్కెట్ యార్డును నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి రూ.50 వేల కోట్లు ప్యాకేజీ ప్రకటించాలి

- సిపిఎం నేతలు లోకనాథం, కోటేశ్వరరావు
- రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 50వేల కోట్ల రూపాయల ప్యాకేజీ ప్రకటించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. అనకాపల్లి సిపిఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో ఫిబ్రవరి 1, 2 ,3 తేదీల్లో నెల్లూరులో జరుగు సిపిఎం 27వ రాష్ట్ర మహాసభల పోస్టర్ వారు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభలో ప్రధానంగా ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధిపై చర్చించనున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం విభజన హామీల్లో భాగంగా ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఇవ్వాల్సిన నిధులు కేటాయింపు చేయలేదన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు ప్రారంభించకపోవడం వలన ఉత్తరాంధ్రలో ఎనిమిదిన్నర లక్షల ఎకరాల భూములకు సాగునీరు అందకుండా పోయిందని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలో సహజ వనరులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని విమర్శించారు. విజన్ 2047 పేరుతో ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర చేస్తామని చెబుతున్నారని, కాని సముద్రతీర ఉత్తరాంధ్రలో ప్రాంతమంతా కాలుష్యకారక పరిశ్రమలతో నిండిపోయిందని తెలిపారు. రానున్న కాలంలో ఉత్తరాంధ్ర శ్మశానవాటికగా మార్చే ప్రయత్నం ప్రభుత్వాలు చేస్తున్నాయని విమర్శించారు. గిరిజన ప్రాంతంలో పంపుడ్ స్టోరేజ్ పేరుతో అదానీకి విద్యుత్ సంస్థలను కట్టబెడుతున్నారని మండిపడ్డారు. మైదాన ప్రాంతంలో సముద్ర తీరం ప్రాంతం మొత్తాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని పేర్కొన్నారు. వస్తున్న పరిశ్రమల్లో ఎక్కడా కూడా స్థానికులకు ఉపాధి కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ పరం కాకుండా చూస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన కూటమి, ఇప్పుడు సొంతగనులు కేటాయించకుండా ప్యాకేజీలతో సరిపెట్టేస్తున్నారని తెలిపారు. పరిశ్రమ ప్రారంభం కాకుండానే మిట్టల్ స్టీల్ కంపెనీకి ఏపీఎండిసితో ఐరన్ ఓర్‌కి ఒప్పందం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ పరిశ్రమ స్టీల్ ప్లాంట్‌కు మాత్రం గనులు ఇవ్వడం లేదన్నారు. అనకాపల్లి జిల్లాలో ఉన్న సుగర్ ఫ్యాక్టరీలను ఆధునీకరణ చేస్తామని చెప్పి నేటికీ క్రషింగ్ పనులే ప్రారంభం కాలేదన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి భవిష్యత్తు పోరాటాలకు సిపిఎం రాష్ట్ర మహాసభలలో చర్చిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి వెంకన్న, గంటా శ్రీరామ్, ఎం.అప్పలరాజు, ఆర్.శంకర్రావు, జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లోకనాథం తదితరులు

25 వేల గోకులం షెడ్ల మంజూరుకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : పాడి రైతుల కోరిక మేరకు అదనంగా 25 వేల గోకులం షెడ్లు మంజూరుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించినట్లు రాష్ట్ర పశు సంవర్ధకశాఖ అదనపు సంచాలకులు డాక్టర్ ఆర్. చిన్నయ్య పేర్కొన్నారు. మండలంలోని చిననందిపల్లిలో మంగళవారం జరిగిన పశు ఆరోగ్య శిబిరాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 25 వేల గోకులం షెడ్లు 30 శాతం రాయితీపై మంజూరు చేసినట్లు చెప్పారు. గొర్రెలు, మేకలకు అవసరమైన షెడ్లకు 70 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. సమీకృత మిశ్రమదాణా 60 శాతం రాయితీపై అందిస్తున్నామన్నారు. పశు గ్రాస విత్తనాలను 75 శాతం రాయితీపై సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 12500 పశు ఆరోగ్య శిబిరాలను ఈ నెలాఖరులోగా పూర్తి చేస్తామన్నారు. 40 శాతం రాయితీపై గడ్డి కోత యంత్రాలను అందజేస్తామని పేర్కొన్నారు. ప్రతి పశు వైద్యశాలకు మూడు నెలలకొకసారి రూ.25 వేలు విలువ చేసే మందులు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో పాలు, గుడ్లు, మాంసం ఉత్పత్తిని పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. పశుబీమా ద్వారా 1133 పాడిరైతులకు గతంలో బకాయి పడిన రూ.110 కోట్లను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. అనకాపల్లి జిల్లాలో 230 పశువులు చనిపోగా 173 పశువుల బీమా సొమ్ము రూ.52.5 లక్షలు రైతులకు చెల్లించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ బి.రామమోహన్, డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్, కె.కోటపాడు సహాయ సంచాలకులు ఇ.దినేష్ కుమార్, పశు వైద్య అధికారులు మంజుషారాణి, ప్రియాంక, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర పశు సంవర్ధకశాఖ అదనపు సంచాలకులు డాక్టర్ చిన్నయ్య

ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో యాజమాన్య ప్రతినిధులు

ఒలింపియాడ్‌లో సెయింట్ జాన్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కశింకోట : ఐటీవెల్ సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్, గణితం ఒలింపియాడ్ పరీక్షల్లో సెయింట్ జాన్స్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పాఠశాలకు చెందిన రుత్తిక ఆర్యా వర్ధన్, టర్రీ తాంసన్, అభిరామ్, ఆదిత్య, దేవి, లిప్షా, నిరంజన్ ప్రతిభ కనబర్చారు. వీరిని మంగళవారం ప్రిన్సిపాల్ రూపనంద్, అకడమిక్ ఇన్‌చార్జ్ చంద్రమ్మ అభినందించారు.

బాబా సాహెబ్ మృతికి బూడి సంతాపం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కాశీపురంకు చెందిన షేక్ బాబాసాహెబ్ (బాబ్జీ) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందడంతో సమాచారం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు మంగళవారం బాబ్జీ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మండలంలో ఎల్ఐసి ఏజెంట్‌గా మంచి పేరు ఉన్న బాబ్జీ మరణ వార్త విన్న ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాసరావు, ఏబీఎం శ్రీనివాసరావు, డివిజన్ యూనియన్ నాయకులు ఎం.నాగరాజు, చోడవరం యూనియన్ కార్యదర్శి శంకర్రావు, శ్రీనివాసరావు, కె.వి.రమణ సంఘం నుంచి 30 వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, గ్రామ పెద్దలు, ఎల్ఐసి ఏజెంట్లు అంత్యక్రియలో పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు ఆధ్వర్యాన యలమంచిలిలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ఐద్వా, ఎస్ఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యాన నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-యలమంచిలి

అభం శుభం తెలియని మైనర్ బాలికపై క్రూరంగా అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడు రూపేష్‌ను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు, రైతుసంఘం ఆధ్వర్యాన మంగళవారం విద్యార్థులు బస్టాండ్ నుండి ఆసుపత్రి భవనం వరకు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ మానవహారం నిర్వహించారు. సంఘాల నేతలంతా కలిపి తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం, సిఐటియు మండల కార్యదర్శి సి హెచ్ శివాజీ, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రమణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు మాట్లాడుతూ మైనర్ బాలికపై అత్యాచార నిందితుడు రూపేష్‌ను ఫాస్ట్‌ట్రాక్‌కోర్టులో విచారించి త్వరిత గతిన కఠిన శిక్ష విధించాలని కోరారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, బాలికను చదివించాలని, ఆ ఇంటిలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వంలో విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రతి వీధిలో బెల్టుషాపులు వెలిశాయని, అనకాపల్లి జిల్లా గంజాయి, నేరాలకు అడ్డాగా మారిందని విమర్శించారు.

రూపేష్‌ను బహిష్కరించిన 'హాకీ సంఘం'

తోటి హాకీ క్రీడాకారిణి అయిన మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడడంతో పోక్సో కేసు నమోదైందని పోలీసులు ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో యలమంచిలి హాకీ క్రీడాకారుడైన 27 ఏళ్ల మళ్ల రూపేష్‌పై హాకీ సంఘం శాశ్వతంగా బహిష్కరించింది. ఈ మేరకు మంగళవారం హాకీ సంఘం అత్యవసర సమావేశం నిర్వహించి మళ్ల రూపేష్‌ను హాకీ సంఘం నుండి శాశ్వతంగా బహిష్కరిస్తూ తీర్మానం చేసిందని జిల్లా హాకీ సంఘం ఉపాధ్యక్షుడు రాంబాబు, కార్యదర్శి నరేష్, రాజా తెలిపారు. బాధిత హాకీ క్రీడాకారిణికి హాకీ సంఘం అండగా ఉంటుందన్నారు.

మహా కుంభాభిషేకానికి ఆహ్వానం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రతిష్ఠ శతజయంతి మహోత్సవాల మహా కుంభాభిషేకం ఆహ్వాన పత్రికను మంగళవారం దేవస్థాన కమిటీ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ శాసన మండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావుకు అందించారు. అనంతరం డాక్టర్ శేషు కుమార్ నాగ జగదీష్‌కు శాలువాతో సత్కరించి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి దర్శనానికి విచ్చేయవలసిందిగా కోరారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు బిల్లపాటి కష్ణకుమార్, కొరుపోలు జగదీశ్వరరావు, శ్రీధరాల సోమరాజు, కోరుకొండ బుచ్చిరాజు, ఉప్పల శ్రీనివాసరావు, గుండా సాయి, సూరె సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని సబ్బవరం-1 సెక్షన్ పరిధిలో 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో న్యూ బ్యాకర్స్ కన్స్ట్రక్షన్ వర్క్ కారణంగా ఈనెల 29న బుధవారం ఉదయం 11 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ఫీడర్ల పరిధిలోని సబ్బవరం, తవ్వవానిపాలెం, అమృతపురం, గొల్లలపాలెం, పైడివాడ, ఆసకపల్లి, ఇరువాడ పంచాయతీ పరిధిలోని వినియోగదారులకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గోవాడ సుగర్స్‌ను ఎంపీ సిఎం.రమేష్‌కు కట్టబెట్టే కుట్ర

మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి-చోడవరం : గోవాడ సుగర్ ఫ్యాక్టరీని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌కు కట్టబెట్టాలన్న ఆలోచనతో కూటమి ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోందని మాజీ మంత్రి, వైసిపి చోడవరం నియోజకవర్గం సమన్వయకర్త గుడివాడ అమర్నాథ్ ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీతో కలిసి మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఫ్యాక్టరీ గానుగాట ప్రారంభించిన నాలుగు రోజులకే ఫ్యాక్టరీ మొరాయించడం వెనుక ఉన్న కుట్రకోణం ఏమిటీ? ఈ ఫ్యాక్టరీని ఏమైనా చేయబోతున్నారా? అని ప్రశ్నించారు. జిల్లాకు చెందిన ఎంపీకి ఫ్యాక్టరీ కట్టబెట్టబోతున్నారన్న వదంతులు వస్తున్నాయని, అందుకే ఫ్యాక్టరీకి ఇటువంటి పరిస్థితిని తీసుకొస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. ఐదు లక్షల టన్నుల చెరకును క్రషింగ్ చేసే ఈ ఫ్యాక్టరీ నేడు లక్ష టన్నులైనా గానుగాట ఆడతామన్న గ్యారంటీ లేదన్నారు. ఈ ఫ్యాక్టరీకి పూర్వం వైభవం తెస్తామని, ఆర్థిక చేయూత అందిస్తామని ప్రగల్బాలు పలికిన ప్రజాప్రతినిధులు ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. ఫ్యాక్టరీని చక్కదిద్ది అప్పులు ఊబి నుంచి ఎలా బయటకు తీసుకురావాలో ఆలోచించకుండా ఇంకా మునిగిపోయేలా చేస్తున్నారని మండిపడ్డారు. జరుగుతున్న పరిణామాలు ఎప్పటికప్పుడు రైతులకు చెప్పాల్సిన యాజమాన్యం విషయం దాచిపెడుతున్నట్లుగా ఉందన్నారు. ఇప్పటికైనా పరిస్థితి చక్కదిద్దకపోతే రైతుల పక్షాన ఫ్యాక్టరీ శ్రేయస్సు కోసం పోరాటం చేయక తప్పదని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో ఎక్కడా అప్పు తేకుండా ఉన్న అప్పులను చాలావరకు తీర్చామని, నాటి పరిశ్రమల మంత్రి అమర్నాథ్ సహకారంతో రూ.89 కోట్లు ప్రభుత్వ గ్రాంటు తెచ్చామని చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చే నాటికి రూ.175 కోట్లు అప్పు ఉండగా, తాము దానిని రూ.40 కోట్లకు తగ్గించామని చెప్పారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కనీసం రన్నింగ్ క్యాపిటల్ కింద రూ.5 కోట్లు మంజూరు చేస్తే ఫ్యాక్టరీ నిర్వహణ సాగుతుందని, కానీ ఆ పరిస్థితి కనిపించలేదన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏడువాక సత్యారావు, బొడ్డేడ సూర్యనారాయణ, పుల్లేటి వెంకటేష్, దొడ్డి వెంకటరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

విశాఖ డెయిరీపై కలెక్టర్ జోక్యం చేసుకోవాలి

రైతు సంఘం ఆధ్వర్యాన ధర్నా, వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

విశాఖ డెయిరీలో జరుగుతున్న వ్యవహారాలపై కలెక్టర్ జోక్యం చేసుకోవాలని ఎపి రైతు సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు విశాఖ డెయిరీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టరేట్ ముందు రైతు సంఘం ఆధ్వర్యాన మంగళవారం ధర్నా నిర్వహించి, కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు మాట్లాడుతూ విశాఖ డెయిరీకి పోస్తున్న పాలలో కొంత శాతం తిరిగి వెనక్కి పంపించేయడం దారుణమన్నారు. దేశంలో అనేక రాష్ట్రాలలో పాల ఉత్పత్తి పెరిగినందువలన మార్కెటింగ్కు ఇబ్బందులు రావడం వలన ఈ నిర్ణయం తీసుకున్నట్లు డెయిరీ యాజమాన్యం ప్రకటించిందని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని తగు చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని కోరారు. పాల రైతుల కష్టాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా ఆవు పాల సేకరణ ధర తగ్గించి, ఇప్పుడు మరలా పాలు తిరిగి రైతులకు ఇచ్చేస్తామని చెప్పడం, రైతులు అంగీకరించకపోతే పాల కేంద్రానికి ఒక రోజు సెలవు ప్రకటిస్తామని రైతులను భయపెట్టడం, బ్లాక్ మెయిల్ చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. విశాఖ డెయిరీ అంటే దేశంలో నే ఒక బ్రాండ్ అని, లాభాలలో నడుస్తున్న అతి పెద్ద సంస్థను డెయిరీ యాజమాన్యం చేతకాని తనం, అసమర్ధత వలన నేడు ఇటువంటి పరిస్థితి దాపురించిందన్నారు. వెంటనే డెయిరీ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తగ్గించిన ఆవు పాల సేకరణ ధర వెంటనే పెంచాలని, కష్టాలలో ఉన్న పాల రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, నాయకులు గండి నాయనబాబు, ఎస్.వి.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతు సంఘం నేతలు, రైతులు

సోమిదేవుపల్లి వాటర్‌స్కీమ్ పరిశీలన

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ, మండల ప్రజలకు మంచినీటిని అందించే సోమిదేవుపల్లి కాంప్రహెన్సివ్ వాటర్ స్కీమ్ (సిపిడబ్ల్యుఎస్)ను జిల్లా పరిషత్ సిఈఓ నారాయణరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ డిఈఈ దుర్గాప్రసాద్, జెఈ సత్యకుమార్‌లతో మండల పరిషత్ కార్యాలయంలో వాటర్‌స్కీమ్‌లో ఎదురౌతున్న సమస్యలు, పరిష్కార మార్గాల గురించి చర్చించారు. వాటర్ స్కీమ్ ప్లాన్‌ను విశ్లేషించారు. సోమిదేవుపల్లి నుండి పైపుల ద్వారా గ్రామాల్లోని వాటర్ హెడ్ ట్యాంకులకు నీరందించే వరకు మాత్రమే ఆర్‌డబ్ల్యుఎస్ బాధ్యత అని డిఈఈ దుర్గాప్రసాద్ చెప్పారు. ఆ తర్వాత నీటి డిస్ట్రిబ్యూషన్ బాధ్యత ఆయా గ్రామపంచాయతీలదేనని స్పష్టం చేశారు. ఎర్రవరం సంపునకు నీరందించడమే ఆర్‌డబ్ల్యుఎస్ పాత్ర అని, అక్కడ నుంచి మున్సిపాలిటీలో ట్యాంకులకు నీరందించడం, డిస్ట్రిబ్యూషన్ మున్సిపాలిటీ చూసుకుంటుందని చెప్పారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఎక్కడ ఏది ఉండాలి, అందంగా ఎలా ఉండాలో ఎంపిడిఓ కొండలరావుకు వివరించారు. ఫైల్స్ నిర్వహణ, ఆధునకరించడం ఎప్పటికప్పుడు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ జెఈ పి.సత్యకుమార్, మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాదరావు తదితరులున్నారు.

డాక్‌యార్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని మల్లునాయుడు పాలెం గ్రామంలో మంగళవారం నావెల్ డాక్ యార్డ్ వెల్ఫేర్ అసోసియేన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. నావెల్ డాక్ యార్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో గౌరవ అధ్యక్షులు రొంగలి కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో సంఘం అధ్యక్షులుగా ఎం.దాసుబాబు, ఉపాధ్యాక్షులుగా జి.అచ్చుతరావు, కె.ప్రసాదు, ప్రధాన కార్యదర్శిగా కె.రవి, సహాయ ప్రధాన కార్యదర్శిగా ఆర్‌వి.రమణ, కోశాధికారిగా జి.దేముడు, సహాయ కోశాధికారిగా ఎస్ హరీష్, కార్యవర్గ సభ్యులుగా ఎస్.ఎర్నినాయుడు, పి శ్రీరాములు, పి ఈశ్వరరావు, పి అచ్చయ్య నాయుడు, జి చిన్న రాము, ఆర్ గణపతి, జి పరదేశి, ముఖ్య సలహా దారుడుగా నోర్నిపూడి సత్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : వందల కోట్ల రూపాయల ప్రభుత్వ భవనాలు నేడు అసాంఘిక నిలయాలుగా మారాయని, ప్రభుత్వ భవనాల నిర్వహణకు అద్దెల రూపంలో కోట్ల రూపాయలు ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని ప్రజా సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేసింది. ప్రభుత్వ భవనాల్లో కార్యాలయాలు నిర్వహించాలని, ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని మంగళవారం ఆర్డిఓ షేక్ ఆయిషాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు చిన్ని యాదవ్, బండి అప్పారావు, వాసుపల్లి తాతయ్యలు, బొబ్బిలి గోవిందరాజులు, భరిణికాన సూరిబాబు, సత్యసాయిబాబా పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన టిప్పర్

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి చోడవరం రోడ్లో దర్జీ నగర్ వద్ద మంగళవారం జరిగిన ప్రమాదంలో ఆటో స్వల్పంగా దెబ్బతింది. లోడుతో స్పీడ్‌గా వెళ్తున్న టిప్పర్ ఆటోను ఢీ కొట్టి కొంత దూరం ఈడ్చుకు పోయింది. ఈ ప్రమాదంలో ఆటో ముందు భాగం స్వల్పంగా దెబ్బతినగా ఆటోలో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చున్నారు.

తాగునీటి బోరు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చియ్యపేట మండలం కేపీ అగ్రహారంలో మంగళవారం సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాస్ తాగునీటి బోరు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జడ్పిటిసి దొండా రాంబాబు సిఫారసు మేరకు రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి ఎంపీ గ్రాంట్స్ నుండి నిధులు మంజూరు చేశారని తెలిపారు. దేవర వారి కల్లాల వద్ద ఇటు రైతులకు అటు పశువులకు ఉపయోగపడేలా బోరు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ మాజీ ఎంపీపీ ఎంవీవీ సత్యనారాయణ, ఉపసర్పంచ్ దేవర ముసలినాయుడు పాల్గొన్నారు.

బోరు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్

విశాఖ డెయిరీ అవినీతి అక్రమాలపై

ఉన్నతస్థాయి న్యాయ విచారణ జరపాలి

సిపిఎం నేతలు లోకనాథం, కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖ పాల డెయిరీ యాజమాన్యం అవినీతి, అక్రమాలపై ఉన్నతస్థాయి న్యాయ విచారణ జరిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ సమావేశం మంగళవారం పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లోకనాథం, కోటేశ్వరరావు మాట్లాడుతూ విశాఖ డెయిరీ యాజమాన్యం తగ్గించిన ఆవు పాల ధర 4 రూపాయలు పునరుద్ధరించాలని, పాలసేకరణ లక్ష్యం కుదిస్తూ పదిలీటర్లు పాలు పోస్తున్న రైతులకు తిరిగి లీటర్ పాలు వెనక్కి ఇస్తూ రైతులను ఆందోళనకు గురిచేస్తున్న విశాఖ డెయిరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌గా ప్రారంభమైన విశాఖ డెయిరీ తరువాత సహకార సంఘంగా మారిందని తెలిపారు. అయితే చట్టంలో ఉన్న లొసుగులను వినియోగించుకొని విశాఖ డెయిరీని మ్యాక్స్ చట్టం కిందకు, తరువాత కంపెనీ చట్టం కిందకు యాజమాన్యం మార్చింది తెలిపారు. దీంతో ప్రభుత్వ పర్యవేక్షణ లేక అన్ని అక్రమాలకు అవకాశం కలిగిందన్నారు. ప్రభుత్వ సహకారం, పాలరైతుల త్యాగం, సిబ్బంది చేసిన కృషితో లక్షల రూపాయలతో 1973లో ప్రారంభమైన విశాఖ డెయిరీ ఆస్తులు నేడు వేల కోట్లకు చేశారని తెలిపారు. నేడు చైర్మన్, వారి కుటుంబ సభ్యుల ప్రయివేటు ఆస్తిగా మార్చుకొని అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. ఆవు పాల సేకరణ ధర తగ్గించిన నేపథ్యంలో రైతులు విశాఖ డెయిరీ పరిపాలన భవనాన్ని ముట్టడించడంతో రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చర్చించి విశాఖ డెయిరీ అక్రమాలపై శాసనసభా కమిటీని నియమించిందని గుర్తు చేశారు. శాసనసభా కమిటీ విచారణ, పాలధర తగ్గింపుకు వ్యతిరేకంగా రైతుల నిరసనలు కొనసాగుతుండగానే డెయిరీ యాజమాన్యం పాలసేకరణ తగ్గిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం దారుణమన్నారు. మొత్తం విశాఖ డెయిరీ వ్యవహారంపై ఉన్నత స్థాయి న్యాయ విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

జిఓ 13ను రద్దు చేయాలని గీత కార్మికుల ధర్నా

వినతిపత్రం ఇస్తున్న గీత కార్మికులు

ప్రజాశక్తి-రాంబిల్లి

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అబ్కారీ పాలసీలో భాగంగా జారీ చేసిన జీవో నెంబర్ 13న రద్దు చేయాలని, గీత కార్మిక సొసైటీలకు 10శాతం మద్యం షాపులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రాంబిల్లి తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలమంచిలి నియోజకవర్గ యాతకుల సంక్షేమ సంఘం కన్వీనర్ పెంకె మారేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 13 వలన గీత కులాలకు కేటాయించిన మద్యం షాపులు మద్యం మాఫియా చేతిలోకి తరలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మండల గీత కార్మిక సంఘం నాయకులు రంగాల నాగరాజు మాట్లాడుతూ గీత కార్మికులకు ఉపాధి కల్పించవలసిన రాష్ట్ర ప్రభుత్వం ఇలా మద్యం మాఫియాకు గీత కులాల వారి మద్యం షాపులను అప్పగించే కుట్ర చేయడం దారుణమన్నారు. రాంబిల్లి మండల యాత సంక్షేమ సంఘం నాయకులు పిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గీత కార్మికుల పొట్ట కొట్టే విధంగా జీవో జారీ చేశారని, కేవలం కొంతమంది మద్యం వ్యాపారస్తులను సంతృప్తిపరిచే విధంగా ఈ జీవో ఉందని తెలిపారు. అనంతరం తహశీల్దారుకు విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దుంగ అప్పారావు, పిల్లి సహదేవుడు, ఆర్.నూకరాజు, ఆర్.అప్పారావు, డి.నూకరాజు, కుమార్ జి.అన్నవరం, కండిపల్లి గణ, నొట్ల పోతురాజు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని తెపురం ఆంజనేయ స్వామి తీర్థం మంగళవారం ఘనంగా జరిగింది. జడ్పిటిసి దొండా రాంబాబు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నరేందర్ సింగ్ బేడీకి ఘన నివాళి

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో మంగళవారం రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర కో కన్వీనర్ బాలు గాడి అధ్యక్షతన ఎన్.ఎస్.బేడీ సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న ప్రముఖ సామాజిక ఉద్యకారుడు పి.ఎస్. అజయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ కూలీలకు స్వగ్రామంలోనే పనుల కల్పన జరగాలని, కనీస వేతనాలు చెల్లించాలని పోరాటం చేసి రాష్ట్ర వ్యాప్తంగా సైకిల్ యాత్ర జరిపింపి అప్పటి గవర్నరు కృష్ణకాంత్ హామీ తీసుకున్నారని తెలిపారు. ఆ హామీ కొరకు నిత్యం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పోరాటం చేసిన వ్యక్తి నరేందర్ సింగ్ బేడీ అని పేర్కొన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ బహు అరుదైన వ్యక్తిత్వం, నిరాడంబరతతో ప్రజా సేవ చేసిన వ్యక్తి నరేందర్ సింగ్ బేడీ అన్నారు. ఆయన మరణం వ్యవసాయ కూలీ వర్గానికి తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆప్ నాయకులు కొణతాల హరినాథ్ బాబు, ఏఐటీయూసీ నాయకులు కోన లక్ష్మణ, రైతు సంఘం నాయకులు కోరిబిల్లి శంకర్రావు, నరాలశెట్టి సత్యన్నారాయణ, వియ్యపు రాజు తదితరులు పాల్గొన్నారు.

రథసప్తమి వేడుకల ఏర్పాట్లపై ఆరా

ప్రజాశక్తి-అనకాపల్లి

ఫిబ్రవరి 4వ తేదీన జరగబోయే రథసప్తమి ఉత్సవాలలో భాగంగా అనకాపల్లి మండలం రాజుపాలెం గ్రామంలో ఉన్న శ్రీశ్రీశ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానాన్ని మంగళవారం ప్రభుత్వ అధికారులతో కలిసి ఏర్పాట్లను అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీకి సూచించారు. ఈ కార్యక్రమం లో కూటమి నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మశ్రీని కలిసిన అదీప్‌రాజ్

ప్రజాశక్తి-సబ్బవరం : వైసిపి అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్తగా నియమితులైన మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీని పెందుర్తి మాజీ శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలసి పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు, నాయకులు కోటాన రాము, కోన రామారావు, గోరపల్లి శ్రీను, చిరికి దేముడు, సర్పంచ్‌లు సబ్బవరపు నారాయణ మూర్తి, మెపాడ అప్పారావు, మంటి మహేష్, దాసరి సత్తిబాబు, రాపెటి మాధవరావు, చొప్ప నాగరాజు, బోర్రయ్య, అప్పికొండ మహాలక్ష్మి నాయుడు, సుందరపు అప్పారావు, జోబుదాసు, పైడిరెడ్డి, మద్ది శ్రీను, వేపాడ శ్రీను, రఘు, రాంబాబు పాల్గొన్నారు.


ధర్మశ్రీని సత్కరిస్తున్న అదీప్‌రాజ్, వైసిపి నేతలు

ప్రజాధనం దుర్వినియోగం... ప్రయోజనం శూన్యం!

- వినియోగంలోని లేని మాడుగుల బస్‌షెల్టర్
- మరుగుదొడ్లు లేక ప్రయాణికుల అగచాట్లు
- పట్టించుకోని అధికారులు, నేతలు

ప్రజాశక్తి- మాడుగుల : మాడుగుల కేంద్రంలో లక్షల ప్రజాధనం వెచ్చిన నిర్మించిన ఆర్‌టిసి బస్సు షెల్టర్‌తోపాటు అందులో ఉన్న మరుగుదొడ్ల నిరుపయోగంగా మారాయి. వినియోగానికి యోగ్యంగా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతు న్నారు. నిత్యం ఇటుగా ఆర్‌టిసి బస్సుల్లో రాకపోకల సాగిస్తున్న ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు మాడుగుల కేంద్రం వచ్చేసరికి అత్యవసర మరుగు అవసరాలకు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది. నీటి సదుపాయం ఉన్నా, శుభ్రతకు నోచుకోని దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే బస్‌షెల్టర్ వినియోగంలో లేకపోవడంతో మందుబాబులకు నిలయంగా మారగా, వాటితోపాటు ఆ పక్కనే ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు కూడా వారికే ఉపయోగకరంగా మారాయని పలువురు అనుకుంటున్నారు

మాడుగుల బస్‌స్టాండ్‌లో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

.ఈ తరుణంలో విశాఖపట్నం, అనకాపల్లి, పాడేరు వివిధ ప్రాంతాల నుండి ప్రయాణం సాగించే మహిళలు మాడుగుల కేంద్రానికి వచ్చి కొంత సేపు ఆగిన సమయంలో వారి అత్యవసరానికి మరుగుదొడ్లు అందుబాటులో లేకుండా పోయాయని అంటున్నారు.

నిర్మాణాలు చేపట్టడం తప్ప వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకోవడంలో విఫలం వల్ల ప్రజలు ఇబ్బందులు పడడమే కాకుండా, ప్రజాధనం దుర్వినియోగమౌతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని ప్రజలకు ప్రయాణికులకు ఉపయోగపడే విధంగా బస్సు షెల్టర్‌తో పాటు మరుగుదొడ్లను కూడా వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. మందుబాబులకు నిలయంగా మారిన బస్‌షెల్టర్‌పై ఉదయం సాయంత్రం వేళల్లో పోలీసులతో పాటు సంబంధిత అధికారులు ఒక కన్నేసి ఉంచాలని పలువురు కోరుతున్నారు.

ఆకట్టుకున్న లేగదూడల ప్రదర్శన

లేగదూడల ప్రదర్శనను తిలకిస్తున్న వెటర్నరీ అధికారులు

ప్రజాశక్తి-రోలుగుంట : జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సహకారంతో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రోలుగుంట మండలం గుండుబాడు పంచాయతీ కసిరెడ్డిపాలెం గ్రామంలో మంగళవారం కుసర్లపూడి పశువైద్యాధికారి డాక్టర్ పైలా సురేష్ ఆధ్వర్యంలో స్థానిక గోపాలమిత్ర కిల్లాడ చిన్నం నాయుడు సహకారంతో లేగ దూడల ప్రదర్శన జరిగింది. లేగదూడల ప్రదర్శనను రావికమతం వెటర్నరీ ఎడి డాక్టర్ పుష్ప, సర్పంచ్ మామిడి అప్పల నర్సమ్మ, ఎంపిటిసి గుర్రం లోవరాజు ప్రారంభించారు. ప్రదర్శనలో జెర్సీ, హెచ్‌ఎఫ్, ముర్ర, పుంగనూరు, ఒంగోలు, గిర్ వంటి వివిధ జాతులకు చెందిన 62 దూడలు ఆకర్షణీయంగా నిలిచాయి.. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ పశు వైద్యులు డాక్టర్ సౌజన్య, రోలుగుంట పశు వైద్యాధికారి డాక్టర్ నూకేశ్వరరావు మూడు ఉత్తమ దూడలు ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కొత్తకోట పశు వైద్యాధికారి డాక్టర్ బాలతేజ లేగదూడల పెంపకం, యాజమాన్యంపై అవగాహన కల్పించారు. స్థానిక పశు వైద్యులు డాక్టర్ పైల సురేష్ మాట్లాడుతూ, ఆడ దూడలు పుట్టేందుకు అందుబాటులో ఉన్న కృత్రిమ గర్భధారణ వీర్య నాళికల సాంకేతికతను వివరించారు. లేగ దూడలకు బలవర్ధక మందులు, నట్టల నివారణ మందు, మినరల్ మిక్సర్ ఉచితంగా అందజేశారు. గ్రామ పెద్దలు పరిసం లోవ, సేనాపతి బాబుజీ, సిబ్బంది వల్లిక, జగదీశ్వరి, శ్రీను, సన్యాసినాయుడు, రమణ, రామనాయుడు, డైరీ గోవిందు, పాడిరైతులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం కొత్తకోట గ్రామ 4వ వార్డులో ఎంపిటిసి కుంచా లక్ష్మీ శంకరరావు మండలపరిషత్ కోటా నిధులు రూ.2లక్షలతో జెట్టి వారి ఇంటి వద్ద నుండి, కలగర్ల రాధాకృష్ణ కిరాణా దుకాణం వరకు సిసి డ్రైనేజీ నిర్మాణ పనులకు మంగళవారం గ్రామ సర్పంచ్ కొన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవ, డిసిసిబి మాజీ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి ఆదిమూర్తి, రావికమతం మండల కార్యదర్శి శీలం శంకరరావు, జిల్లా వర్తక సంఘం అధ్యక్షులు కేదారిశెట్టి గున్నాజిరావు, వైసిపి యూత్ అధ్యక్షులు శీలం కళ్యాణ్, వార్డు సభ్యులు గుమ్ముడు దొరబాబు, తాటికొండ స్వామి, కొసిరెడ్డి శివాజీ, గట్రెడ్డి దివాకర్, భీమరాతి వెంకట, కోసిరెడ్డి సత్యనారాయణ, మాజీ సభ్యుడు వేమవరపు రమణ పాల్గొన్నారు.

శరవేగంగా సిసి రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని పప్పుశెట్టిపాలెం పంచాయతీ 5వ వార్డు ఎస్‌సి కాలనీలో బిజా రాజు ఇంటి సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మాకిరెడ్డి వరహాలబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే పల్లెపండుగలో భాగంగా సిసి రోడ్లు వేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ నాయకులు బెల్లపు కొండలరావు, మాజీ సర్పంచ్ వార్డు నెంబర్ గొట్టేటి రాజబాబు, ఎస్టీ సెల్ నాయకులు దట్టెం రమణ, గోకేటి అప్పలరాజు, పొట్ల శ్రీను, రాయపురెడ్డి నానిబాబు, హరేష్, స్కూల్ కమిటీ చైర్మన్ గోవింద పలువురు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ముఖ్యమంత్రి సహాయనిధి కింద వైద్యసాయానికి మంజూరైన చెక్కును మంగళవారం నర్సీపట్నం స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ బాధితులకు అందజేశారు. స్పీకర్ సిఫార్సుతో పెద్ద బొడ్డేపల్లికి చెందిన బోలెం రాజబాబు సతీమణి లక్ష్మి రూ.1,54,215 ముఖ్యమంత్రి సహాయనిధి సాయం మంజూరుకాగా, సంబంధిత చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా చింతకాయల విజయ్ మాట్లాడుతూ ఆరు నెలల కూటమి ప్రభుత్వం కాలంలో నియోజకవర్గంలో 16 మందికి సీఎం సహాయనిధి ద్వారా సాయం చెక్కులు అందించడంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు కృషి చేశారు అని అన్నారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి సాయం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో 10వ వార్డు కౌన్సిలర్ రాజుల నాయుడు, సబ్బవరపు అప్పలనాయుడు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న విజయ్

గ్రంథాలయ సేవలను విస్తృతం చేయండి

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వెంకటరావు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని చినగొడ్డిగల్లు గ్రంథాలయాన్ని మంగళవారం ఉమ్మడి జిల్లాల గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సిహెచ్ వెంకటరావు మంగళవారం సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. గ్రంథాలయంలో పాఠకులు సంఖ్య పెంచాలని, ఎక్కువమంది సభ్యులను చేర్పించాలని తద్వారా గ్రంథాలయ సేవలను విస్తృతం చేయాలని లైబ్రేరియన్ కె జనార్దన్‌రావుకు సూచించారు. అదేవిధంగా ప్రతి ఆదివారం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న చదువు అంటే మాకు ఇష్టం కార్యక్రమానికి ఎక్కువ మంది విద్యార్థులు హాజరయ్యే విధంగా చూడాలన్నారు.

గెజిటెడ్ అధ్యాపకుల సంఘం

జిల్లా అధ్యక్షునిగా విష్ణుమూర్తి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షునిగా స్థానిక ఎస్‌విఎల్‌ఎన్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చీడి విష్ణుమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల పర్యవేక్షణ అధికారిగా వ్యవహరించిన సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణిత శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎంవి.రామకృష్ణ తెలిపారు. విశాఖలోని డాక్టర్ విఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం ఎన్నికలు జరిగాయి. డాక్టర్ విష్ణుమూర్తి గత మూడు పర్యాయాలుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. డాక్టర్ విష్ణుమూర్తిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మంజుల, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

పలు గ్రామాల్లో పశు ఆరోగ్య వైద్యశిబిరాలు

ప్రజాశక్తి- మాడుగుల :పశుఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ మాడుగుల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వి.చిట్టినాయుడు అన్నారు. మంగళవారం మాడుగులలో కర్రి వారి కల్లాల వద్ద నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ యడ్ల కళావతి ప్రారంభించగా, వెటర్నరీ పాడేరు డివిజన్ వెటర్నరీ ఉప సంచాలకులు డాక్టర్ నరసింహులు, మాడుగుల ఎడిఎ డాక్టర్ చిట్టినాయుడు పాల్గొని, సేవలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా 70 పశు వులకు సాదారణ చికిత్సలు , 13 పశువులకు గర్భ కోశ వ్యాధుల చికిత్సలు, 5 పశువులకు చూడి పరీక్షలు, 42 పశువులకు, 25 పెయ్యలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు . కార్యక్రమంలో మొత్తం 48 మంది రైతులు సేవలు వినియోగించుకున్నారు. కార్యక్రమంలో శ్రీనాథు శ్రీనివాసరావు, పుష్పాల రమేష్, రంజిత్ వర్మ, రొబ్బ మహేష్, లెక్కల కాశీ బాబు, పి.సూర్యనారాయణ వర్మ, మరువాడ ఈశ్వరరావు, లైవ్ స్టాక్ అసిస్టెంట్ సౌజన్య, పశువైద్య సహాయకులు చంద్ర, కృష్ణారావు, అంబులెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

కోటవురట్ల: మండలంలో మంగళవారం సుంకపూరు, జగ్గంపేట గ్రామాలలో పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జీవాలకు, పశువులకు నట్టల నివారణ మందులతో పాటు పాడి పశువులకు గర్భకోశనివారణ చికిత్సలు నిర్వహించారు. మినరల్ మిక్సర్, మందులు అందజేశారు, కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగులలో దూడలకు డీవార్మింగ్ చేస్తున్న పశువైద్యులు, సిబ్బంది

గొలుగొండ : మండలం కొంకసింగి గ్రామంలో మంగళవారం పశుఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఏఎల్.పురం పశువైద్యాధికారి డాక్టర్ జీ.శిరీష పాల్గొని, పశువులకు వైద్య సేవలు అందించారు. దూడలు, జీవాలకు డీవార్మింగ్, పశువుల గర్భకోశవ్యాధులకు చికిత్సలు చేసి మందులు అందజేశారు. సర్పంచ్ నూక రత్నం, పశువైద్య సహాయకులు హారిక, హరి, జోగేంద్ర, అప్పారావు, ల్యాబ్ టెక్నీషియన్ ఉదయ్ పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని కొత్తపల్లి గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని సర్పంచ్ శ్యాంసన్ ప్రారంభించారు. కసింకోట పశువైద్యాధికారి డాక్టర్ అల్ఫోన్సా జార్జ్ శిబిరంలో 22 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స, 30 పశువులకు నట్టల నివారణ మందులు అందించారు. మాజీ సర్పంచ్ బుద్ధిరెడ్డి గంగయ్య, టిడిపి కూటమి నాయకులు బద్ది గోవింద్, ఎర్రంశెట్టి సత్యనారాయణ, ఎర్రంశెట్టి బాబూజీ, సిహెచ్ సూరిబాబు, పేయ్యల కృష్ణ, తిర్రి విజయ్ కుమార్, గుండు రమేష్, రైతులు పాల్గొన్నారు.

తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ నమ్మివానిపాలెంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ డి.రామకృష్ణ, భీమిలి డివిజన్ సహాయ సంచాలకులు డాక్టర్ బి.వెంకటరమణ, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు ఎస్‌జి.ప్రశాంతి, అనిల్‌కుమార్, సిబ్బందితో కలిసి 72 ఆవులకు, 21 గేదెలకు, 360 గొర్రెలకు, 251 మేకలకు వైద్య పరీక్షలు చేశారు. ఇందుకు సంబంధించి చిప్పాడ దివీస్ సంస్థ సహకారంతో ఆయా పాడి రైతులకు రూ.80 వేల విలువైన మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్ కుమార్, ప్రతినిధులు ఎ.శ్రీనివాస్, నరసింహా రావు, శేఖర్‌బాబు, తాళ్లవలస వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతలకు సత్కారం

అధికారులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-నక్కపల్లి : గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఉత్తమ ఉద్యోగులుగా జిల్లా కలెక్టర్ నుంచి సేవా పురస్కారం అందుకున్న ఉమ్మడి జిల్లాల జెడ్‌పి సిఇఒ పి నారాయణమూర్తి, తహసిల్దార్ ఆర్ నరసింహమూర్తి, ఎంపిడిఒ డి సీతారామరాజులను మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి రత్నం, జడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపిపి వెలగా ఈశ్వరరావు, వైసీపీ నేతలు వీసం రామకృష్ణ, మణి రాజు, పాపారావు, వెంకటరమణ, తాతారావు, గోవిందు తదితరుల దుశ్శాలువాలతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారుల సేవలను కొనియాడారు.

కాలువను ఆక్రమించుకున్నా పట్టించుకోరా?

- బాహాటంగానే సిమెంట్ స్తంభాలతో కంచె ఏర్పాటు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

ప్రజాశక్తి -కోటవురట్ల : ప్రభుత్వ భూమి సెంటు కూడా ఆక్రమణకు గురైతే ఉపేక్షించేది లేదంటూ ముఖ్యమంత్రి, డిప్యూటీ సహా మంత్రులందరూ, పలుమార్లు అధికారులను హెచ్చరిస్తున్నా, ఆచరణలో ఆక్రమణలకు కొదవ లేదంటే అతిశయోక్తి కాదు. పంట పొలాలకు, చెరువుకు సాగునీరు అందించే కాలువను ఆనుకుని ఉన్న గోర్జిని సైతం ఆక్రమించుకుని, యథేచ్ఛగా సిమెంట్ స్తంభాలతో కంచె ఏర్పాటు చేసుకుంటున్నా అధికారుల తమకేమీ పట్టనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో రెవిన్యూ గ్రామమైన కేబి అగ్రహారం పరిధిలో సర్వేనెంబర్ 13-1 వద్ద ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న కొండగడ్డ గోర్జిని ఆక్రమించుకొని దర్జాగా సిమెంట్ స్తంభాలతో కంచె ఏర్పాటు చేస్తున్నారు, అయినా రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం పట్ల స్థానికులు తీవ్ర ఆరోపణలు గుప్పించడంతోపాటు అధికారులు తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, ప్రధాన రహదారిని అనుకోని ఉన్న కాలువ గతంలో 20 అడుగుల వరకు గోర్జి కాలువ ఉండేదని దానిని నాలుగు అడుగులకు పరిమితం చేసి కాలువను సమీప రైతు తమ భూముల కలుపుకొని కంచె ఏర్పాటు చేస్తున్నారు, కాలువ ఆక్రమించుకోవడంతో భవిష్యత్తులో వర్షపు నీరు రోడ్లపై నుంచి ప్రవహిస్తుందని దీంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు అంటున్నారు. అంతేకాకుండా కాలువ ఆక్రమణకు గురికావడంతో చెరువులకు పంట పొలాలకు వెళ్లే నీరు సక్రమంగా సరఫరా కాదని రైతులుఆవేదన వ్యక్తం చేస్తున్నారు, సమీపంలోని కొండను తవ్వి ఆక్రమించుకుంటున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు, విషయమై స్థానిక తాహసిల్దార్ తిరుమల బాబును వివరణ కోరగా సిబ్బందితో దర్యాప్తు చేయించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు

కాలువను ఆక్రమించి ఏర్పాటు చేస్తున్న సిమెంట్ దిమ్మల కంచె

బాల్య వివాహం అడ్డగింత

బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

ప్రజాశక్తి - రావికమతం : మండలంలో తట్టబంద గ్రామంలో బాల్యవివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. బాల్య వివాహం జరపటానికి పూనుకున్న తట్టబంద గ్రామానికి చెందిన తల్లిదండ్రులు కొట్యాడ రాజారావు, మణి దంపతులకు కౌన్సెలింగ్‌నిచ్చి, 18ఏళ్ల నిండకుండానే పెళ్లి చేస్తున్న వారి కుమార్తె కొట్యాడ కావ్య వివాహం జరగకుండా చేశారు. బాల్యవివాహం జరుగుతుందన్న సమాచారంతో ఐసిడిఎస్ అధికారులు గ్రామానికి చేరుకొని చేరుకుని సర్పంచ్ గోకివాడ రమణ సమక్షంలో వివాహాన్ని నిలుపుదల చేయాలని బాలిక తల్లిదండ్రులకు సూచించారు. మైనర్లకు వివాహం చేయడం వల్ల కలిగే అనర్థాలను, చట్టపరంగా ఎంతటి నేరమో వారికి వివరించారు. నిబంధనలను ఉల్లంఘించి బాల్యవివాహానికి పూనుకుంటే వధూవరులతోపాటు ఇరువైపులా తల్లిదండ్రులపై కేసులు నమోదు అవుతాయని హెచ్చరించారు. 18 ఏళ్లు నిండిన తరువాత ఇష్ట పూర్వకంగా వివాహం చేసుకోవచ్చని సూచిచారు. బాలిక తల్లిదండ్రుల నుంచి వివాహం నిలుపుదలపై సర్పంచ్ సమక్షంలో ఒప్పందపత్రాలు రాయించిన తర్వాత అధికారులు వెనుదిరిగారు.

మాజీ సర్పంచ్ అప్పారావు మృతి

పందిరి అప్పారావు(ఫైల్÷

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని పాతకృష్ణదేవిపేట మాజీ సర్పంచ్ పందిరి అప్పారావు (80) మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పారావు కాంగ్రెస్ పార్టీ తరపున నాలుగు సార్లు సర్పంచ్‌గా పని చేశారు. ప్రస్తుతం ఆయన పెద్ద కుమారుడు పందిరి సత్యంనాయుడు పాతకృష్ణదేవిపేట సర్పంచ్‌గా ఉన్నారు. అప్పారావు మృతి పట్ల వివిధ పార్టీల నాయకులతో పాటు గ్రామస్థులు సంతాపం వ్యక్తం చేశారు.

గీతం విద్యార్థుల రక్తదానం

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బిజినెస్ స్కూల్ ఈ నెల 29వ తేదీ నుంచి నిర్వహిస్తున్న గీతం ఎక్సలెన్స్ మీట్ (జెమ్) -2025లో భాగంగా మంగళవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 200 మందికి పైగా విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఎన్‌టిఆర్ బ్లడ్ బ్యాంక్, జిమ్‌సర్ బ్లడ్ బ్యాంక్ నిపుణులు హజరై విద్యార్థులనుంచి రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా గీతం బిజినెస్ స్కూల్ ప్రొఫెసర్ పి.షీలా మాట్లాడుతూ, యువత స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో జెమ్ కన్వీనర్ డాక్టర్ బి.కృష్ణకుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ షేక్ సంషుద్దీన్, ఎస్ఎస్.మిశ్ర, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

శెట్టిబలిజలకు మద్యం దుకాణం

ప్రజాశక్తి-గొలుగొండ : గొలుగొండ, నాతవరం మండలాలకు సంబంధించి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో శెట్టి బలిజ కులస్తులకు ప్రభుత్వం ఒక మద్యం దుకాణం కేటాయించిందని ఎక్సైజ్ సీఐ వి.రామకృష్ణ తెలిపారు. శెట్టి బలిజ కులస్తులు వచ్చేనెల 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా గొలుగొండ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో అవసరమైన ధ్రువీకరణలతో నేరుగా దరఖాస్తు అందజేయాలన్నారు. అనకాపల్లి జిల్లాకు చెందిన శెట్టి బలిజ కులస్తులు మాత్రమే అర్హులని, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తుతోపాటు జతచేయాలన్నారు. వచ్చేనెల 7న అనకాపల్లిలో కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాలను కేటాయిస్తారన్నారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టండి

- ఉద్దండపురం వాటర్ ప్రాజెక్టు సందర్శనలో జెడ్‌పి సిఇఒ నారాయణమూర్తి

వాటర్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న జెడ్‌పి సిఇఒ

ప్రజాశక్తి -నక్కపల్లి :మండలంలోని ఉద్దండపురంలో వాటర్ ప్రాజెక్టును మంగళవారం ఉమ్మడి జిల్లాల జెడ్‌పి సిఇఒ పి నారాయణమూర్తి పరిశీలించారు. అన్ని గ్రామాలకు పూర్తిస్థాయిలో తాగునీరు సరఫరా చేయాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ డి సీతారామరాజు, ఆర్ డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.ఆనంద్, జడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపిపిలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, ఎఇఇ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఆరా

మండలంలో జిల్లా పరిషత్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులపై జిల్లా పరిషత్ సిఇఒ పి.నారాయణమూర్తి ఆరా తీశారు. మంగళవారం మండల పర్యటనలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ కమిషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక అధికారులతో కలిసి జెడ్‌పి సిఇఒ పి. నారాయణమూర్తి పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. జెడ్‌పి నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ డి సీతారామరాజు, ఇంచార్జ్ ఇఒపిఆర్‌డి ఎం శ్రీను, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇఇ నాగభూషణం, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు

పేదలకు నిత్యావసరాల పంపిణీ

పేదలకు నిత్యవసరాలు పంపిణీ చేస్తున్న పూర్ణిమ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : వి216ఏ జోన్ వాసవి వనితా క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమంాసవి క్లబ్ గవర్నర్ పూర్ణిమ, జిల్లా ప్రముఖులు సమక్షంలో మంగళవారం స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నిర్వహించారు. అనంతరం పేద మహిళలకు దుప్పట్లు, బియ్యం పంపిణీ చేసారు. సంక్రాంతి ముగ్గుల పోటీలో గెలిచిన విజేతలకు వాసవీ క్లబ్ గవర్నర్ పూర్ణిమ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన లక్కీ టిప్‌లో విజేతలకు కానుకలను అందజేశారు. అతిథులను ఘనంగా సత్కరించారు. జనరల్ సెక్రెటరీ కేదారశెట్టి విజయలక్ష్మి, క్యాబినెట్ సెక్రటరీ కెవి. సత్యనారాయణ, వైస్ గవర్నర్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త కుటుంబానికి
సొంత నిధులతో సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న స్పీకర్ సతీమణి పద్మావతి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. కష్టాల్లో ఉన్న టిడిపి కార్యకర్త కుటుంబానికి సొంత నిధులతో ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. వివరాలివి. నాతవరం మండలం, ఎపి.పురం పంచాయతీ ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన తెలుగుదేశం కార్యకర్త నక్క అచ్చయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. కష్టాల్లో ఉన్న కార్యకర్త కుటుంబానికి తాను ఆదుకుని అండగా నిలుస్తానని మాటిచ్చిన విజయ్, బాధిత కుటుంబానికి తన వ్యక్తిగత నిధుల నుండి రూ.1.50లక్షల సహాయం అందించారు.

స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇంటి వద్ద తన మాతృమూర్తి చింతకాయల పద్మావతి ద్వారా సాయం చెక్కును అందించి ఇచ్చిన మాటను నెరవేర్చారు. మృతుడి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసానిచ్చారు. సాయం చెక్కును అందుకున్న అచ్చయ్య కుమారులు నక్క పద్మరాజు, నక్క గోవిందరాజులు విజయ్‌కు, అయ్యన్నలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తాండవ చైర్మన్ కారక సత్యనారాయణ, మండల టిడిపి అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, అనకాపల్లి జిల్లా సెక్రటరీ నక్క రమణ, సర్పంచ్ పైల రమేష్ నాయుడు, మాజీ సర్పంచ్ పారుపల్లి రామచంద్ర, ఎంపీటీసీ లోక లావరాజు తదితరులు పాల్గొన్నారు.